# పండుటాకు

"గంగా! నువ్వేమో ముడితె మాసిపోయే మల్లె పూవోలున్నపు. నేనేమో నల్లసరపు గుండ్రాయోలున్న. కాశీపట్నంల కొలువున్న శివుడేమో మనిద్దరికి ముడిపెట్టే" అంటూ చెక్కిలి మీద చిటికేసిన ఈశ్వరయ్య చిలిపి చేష్టలకు, దోర వయసులో కోర చూపుల గంగమ్మ మనోజలధిలో మురిపాల అలలు ఎగిరిపడినై.

"నీతోని నా మెడల మూడు ముళ్లేయించింది గూడా ఆ శివయ్యనే గదా బావా! తనకు పిల్లలు కాలేదని మా అక్క పార్వతి మనకు పెండ్లిజేసె. నువ్వేమో కొంటె బావవు. నేనేమో తుంటరి మరదల్ని. ఇప్పుడు నీకు పెండ్లాన్నైపోతి. ఇంగ మనం ముగ్గురం. ఒకటే." ఈశ్వరయ్య ఒడిలో సిగ్గుల మొగ్గల్ని ఏరుకుంటూ గంగమ్మ చెప్పుకుపోతోంది. "నువు డక్కీ... గదే... గా బుడిగ వాయించుకుంట కథ జెప్తుంటే, నేను చతుర్లు చెప్తూంటే చూసినోల్లంతా 'వారెవా! బుడిగ జంగమోల్ల కథంటే బాగోతం కంటే బాగున్నదంటరు. మన ముగ్గురం ఊరు దిరిగి ఇంటికొచ్చినంక అక్క వంటింట్లకు వోతది. నేను లేడిపిల్లోలె గంతేసి నిన్ను ముద్దువెట్టుకుంట." ఆమె జ్ఞాపకాల వ్యాపకాలువి.

అలనాటి అత్యుత్సాహం ఈనాడు చెంగున ఎగిరించింది. అంతే... గంగమ్మ కూచున్న నులక మంచం అమాంతం విరిగిపోయింది. ఇరవయ్యేళ్ల మిసిమి వయసు మురిపాల మూటలు అరవయ్యేళ్ల వయసులో విప్పుకుని కింద పడేసినై.

తళ తళ లాడ్తున్న తాటాకుల గుడిసె కిలకిలా నవ్వినట్టనిపించింది. ఒళ్లు ఝల్లు మంది. ముసలి సిగ్గు గుసగుసలాడింది.

"వామ్మో!" కాస్సేపు గిలగిల్లాడింది". ఇంకా నయం. నడుము విరిగి పోలేదు" గొణుక్కుంది. గుడిసె. కప్పును గమ్మత్తుగా చూస్తూ నేలమీద చేతులానించి లేచి నుంచుంది. విరిగిన మంచాన్ని పక్కకు జరుపుతూంటే ఆయాసం ముంచుకొచ్చింది. దగ్గు... గొంతును గురుగుర లాడించింది. "నా తెలివి తెల్లారి. నట్టే ఉంది. బయట ఎప్పుడో తెల్లారి పోయింది. ఎందుకో.. గా పాత సంగతులు గుర్తుకొచ్చి పరేషాన్ జేస్తున్నై...." కిటికీలోంచి గుడిసెలోకి చొచ్చుకొస్తున్న లేత సూర్య కిరణాలను ఆశ్చర్యంగా చూస్తూ కాలకృత్యాలు తీర్చుకుంది. రాత్రికి మిగిలిన చద్దన్నం తిని, గోడకొరిగి కూచుంది. మనసు మళ్లీ పాత రోజుల్లోకెళ్లి పోతోంది. గతంలోకి తొంగి చూస్తోంది.

భవిష్యత్తు శూన్యమైన సామాన్య జీవికి గత కాలం జ్ఞాపకాలే కాలక్షేపం. చూపులు శూన్యంలో పరుచుకుంటూ దేని కోసమో వెతుకుతున్నాయి.

ఆడదానికి కట్టుకున్న మొగుడున్నన్ని రోజులే ముద్దూ ముచ్చట్లు. అటెన్క బతుకంతా అడివేగదా! బుడిగ జంగమంటే ఆ రోజుల్లో బుడిబుడి జంగం కాదు. సాక్షాత్తూ జంగం దేవర...శివావతారము.

ఈశ్వరయ్యంటే ఈశ్వరావతారము.

కథా నిలయం
శ్రీకాకుళం

నిలుపుటంగీ, గుండు తలకు పొడగాటి తలపాగ, కాళ్లకు గజ్జెలు, నుదుటి విభూతి రేఖల మధ్య ఎర్రని కుంకుమ బొట్టు.. సుప్రభాత సూర్యుడిలా మెరుస్తూంటే అప్పుడే కైలాసంనుండి దిగివచ్చిన జంగం దేవరలాగుండే వాడు. భుజమ్మీది తంబూరాను చేతి వేళ్లకు తొడుకున్న అందెలతో తడుతూ మరో చేతిని విచిత్రంగా తిప్పుతూ కథ చెప్తూంటే నాట్యమాడుతున్న నటరాజులా కన్పించేవాడు.

పార్వతి, గంగమ్మలు గుమ్మెటలు వాయిస్తూ వంతలు పాడుతూ గొంతులు కలిపేవారు. గంగమ్మ హాస్య పాత్రలో అరమరికలు లేకుండా జీవిస్తూంటే జనాలు విరగబడి నవ్వేవారు. కమ్మగా, నెమ్మదిగా సాగిపోయే బుడిగ జంగం కథా ప్రవాహంలో శివలీలలే కాకుండా దేశింగు రాజు కథ, పలనాటి బాలచంద్రుడు, మైరావణ, భక్త సిరియాళ, అంబరీష, దక్షయజ్ఞం లాంటి పౌరాణిక, ధార్మిక, వీరగాథా కెరటాలు కదుల్తుండేవి. ఇల్లిల్లు తిరిగినా, వేదిక మీద గంటలపాటు కథా కార్యక్రమం నిర్వహించినా సామాన్యులు, అసామాన్యులనే తేడాలేకుండా అందరూ కళ్లు, చెవులు అప్పగించేవారు. బాలనాగమ్మ, సత్యహరిశ్చంద్ర, సీతమ్మవారి కష్టాలు వింటే కంట తడిపెట్టేవారు. ఎండనకా వాన నకా చలిపులికి భయపడకుండా కాయకష్టంతో జీవిస్తూ రక్తాన్ని చెమటగా మార్చి భూమాత ఒడిలో జిలకరించే శ్రమ జీవులు, భూమిపుత్రులు ఆ కథలు విని శ్రమ శక్తిని రెట్టింపు చేసుకునేవారు. మానసికానందం బలవర్ధక ఔషధంగా పంజేసేది.

సామాజికంగా ఉపేక్షతులైన హరిజన, గిరిజన, వెనకబడిన వర్గాలవారి ఇళ్లల్లో ఎవరైనా చనిపోతే, బుడిగ జంగాలే శాస్త్ర సమ్మతంగా సాగనంపేవారు. శవయాత్రలో ధైర్యంగా శవముందు నడుస్తూ, శివనామ స్మరణ చేయిస్తూ, గంటవాయిస్తూ మనిషి చివరి మజిలీయైన శ్మశాన వాటిక లేదా బొందలగడ్డ దాకా వెళ్లి అంతిమ సంస్కారాన్ని భాధ్యతాయుతంగా నిర్వహించేవారు. అందుకు బేడ మాత్రమే తీసుకుని విగత జీవులైన వారి ఆత్మశాంతికోసం వారి పేరున పొగిడేవారు. అందుకే బేడ జంగాలన్నారంటారు.

ఈశ్వరయ్య అన్ని పనుల్లోనూ ఆరిచేతిన వాడు. శివరాత్రి ఉత్సవాలప్పుడు శివాలయ మంతా తానే అయేవాడు. గుడి గోడల దుమ్మదులిపి, సున్నం కొట్టించి, రంగులు వేయించి కైలాస పర్వతములా అలంకరించేవాడు. "అచ్చరభ, శరభా...." నినాదాలిస్తూ శివారాధనలో తన్మయత్వం చెందేవాడు. ఒంటినిండా విభూతి రేఖలతో శివావతారమై పరవశించేవాడు. ఉురేగింపు సందడిలో జన సందోహం మధ్యన.. కాళ్లూ చేతుల్ని తిప్పుతూ ఉల్లాసంగా, ఉత్సాహంగా దండకాలు వేసేవాడు.

"భజే భద్ర! భద్రాంబికా, ప్రాణనాధా!"తో ప్రారంభించి గొంతు నరాలు గమ్మత్తుగా కదుల్తూంటే "సుర రాతిభంగా! ప్రభో రుద్రా! రౌద్రావతారా! సునాశీర ముఖ్యామకానేక సంభావితా సల్ప సుశ్లోక! చారిత్ర! కోట్యర్క సంకాశ! దేదీప్యమాన! ప్రభాదివ్య గాత్రా! శివా! పాలితా! శేష బ్రహ్మాండ భాండోదరా! మేరు ధీరా! విరాడ్రూపా! వారాశి గంభీర! సౌజన్య రత్నాకరా!..." భయానకాశ్చర్య రసాలు మేళవించిన దండకం సాగిపోతూంటే అపర వీరభద్రుడై ఆబాల గోపాలన్ని ఉగ్రూత లూగించేవాడు. ఆ....దృశ్యాలింకా గంగమ్మ స్మృతి పథములో మెదుల్తూ స్ఫూర్తినిస్తుంటాయి.

అప్పుడప్పుడు అక్కాచెల్లెళ్ల మధ్య సవతి పోరు సరదాగా జరుగుతుండేది. పార్వతి మహిషాసుర మర్ధినిలా కొంగు నడుముకు చుట్టుకుని ఒంటి కాలుమీద ఉరికొచ్చి

"గంగమ్మ మెత్తనిదే కాని గట్లకు గట్లు కోసేస్తుందే గంగీ!" అంటూ చేతులు తిప్పుతూ తిడుతుండేది.

"శివ శివా! పార్వతమ్మేతే తండ్రినే చంపించింది గదా! కనికరం లేని ఆడజన్మ కఠిన శిల లాంటిది" అంటూ గంగమ్మ తిరగబడేది.

మర్నాడు అన్నీ మరిచి అక్కాచెల్లెళ్లై పోయేవారు.

ఇద్దరు పెళ్లాల ముద్దుల సంసార సాగరములో ఇలాంటి సరిగమలు మామూలే అనుకునేవాడు ఈశ్వరయ్య. సంసార సాగర యానములో హాయిగా సాగిపోతున్న జీవన నౌకకు సుడిగుండా లెదురైనాయి.

గంగమ్మ రెండో భార్యగా వచ్చినా సంతానవతి కాలేదు. మానవ మాత్రుల ఊహల కందని పై వాని లీలావిలాస మేమో గాని.. ముదురు వయసులో పార్వతి నెలదప్పింది. ఆ కడుపేదో తనకే వచ్చినంత సంబరపడి పోయింది గంగమ్మ. గర్భవతి అక్కను అల్లారుముద్దుగా చూసుకుంది. ఆశల హరివిల్లు కొత్తరూపు సంతరించుకుంది.

కాన్పు కష్టమైంది. పురుళ్లుపోసే మంగలి నర్సమ్మ సమయానికి ఊళ్లో లేదు... అంతా తానే అయింది గంగమ్మ. పండంటి కొడుకును కన్న అక్క ఆ కొడుకును చెల్లెలి చేతుల్లో పెట్టి శివైక్యమైపోతుందని ఎవ్వరూ ఊహించలేదు. పల్లెటూళ్లకు దిగుమతి అవుతున్న పట్నం నాగరికత, సినిమాల మోజు.... టెలివిజన్ వీరంగం... బుడిగ జంగాల బతుకుల్ని ఎడారి మయం చేసినై.

మారిన సామాజిక పరిస్థితి, కలిసిరాని కాలం ఈశ్వరయ్య మెదడు నరాల్లో దుమారం లేపినై. అదుపాజ్ఞల్లో లేకుండా పెరుగుతున్న కొడుకు వీరభద్రుడు, తరిగిపోతున్న ఓపిక దుమారాన్ని దుందుడుకు ఝంఝామారుతంగా మార్చేసి ఈశ్వరయ్యను మంచానికి పరిమితం చేసినై. మామూలు డాక్టర్ల అవగాహనకందని మానసిక రోగం శరీరాన్ని తొలిచి పారేసింది. పెళ్లి చేసినా వీర భద్రునికి బరువుబాధ్యతలు తెలిసి రాలేదు.

ఓ రోజు కొడుకును పక్కన కూచోబెట్టుకున్నాడు. "వీర భద్రా!" మనసులోని మాట తీగలు తెగిన వీణానాదంలా బయటికొచ్చింది. "నీకు ఈడొచ్చింది గాని జ్ఞానంరాలేదు. చెడు సావాసంవల్ల చదువు వానాకాలం చదువైంది. మన కుల విద్యగూడ రాదాయె. అయినా దాన్నెవ్వరూ ఆదరిస్త లేరని శివాలయం పూజారిగా..." దగ్గు తెర తోసుకొచ్చింది. గంగమ్మ అందించిన గ్లాసెడు నీళ్లు శాంతింపజేసినై. "నాకీలోకం..." మరో దగ్గు తెర అతలాకుతలం చేసింది. గుండెల్లో సునామి అలలు చెలరేగినై. గంగమ్మ అందించిన తులసి తీర్థంతో... కొంత నెమ్మదించింది. "ఇంగ నాకు ఈ లోకంతో.. ప్చ్...." గంగమ్మ చెయ్యందుకుని కొడుకు చేతిలో ఉంచాడు. "మీ్మ... మీ హ... అమ్మను

బాగా చూస్కో. ఈ ఇల్లు అమ్మి కొంత అమ్మ పేర బ్యా... బా... బాంకుల వెయ్. నెలనెలా మిత్తి తీసుకుని బతుకుతుంది. మిగిలిందాంతోని ఏదన్నా వ్యాపారం చెచె... చె.... చెయ్...!" అంతే! నోరు అలాగే తెరుచుకునుంది. కాళ్లూచేతులు చప్పబడి పోయినై. పంచప్రాణాలు పంచభూతాల్లో కలిసిపోయినై.

తండ్రి చివరి కోర్కె విషయంలో వీరభద్రుడు శ్రీరామచంద్రుడయ్యాడు. ఇల్లు అమ్మేశాడు. వచ్చిన డబ్బులో సగం బాంకులో గంగమ్మ పేర ఫిక్స్‌డ్ డిపాజిటైంది. మిగతాది తానుంచుకుని వేరే కాపురం పెట్టేశాడు. ఒంటరి గంగమ్మకు ఊరు చివర తాటాకుల గుడిసె గూడా వేయించాడు.

ఐదారేండ్ల కాలం అనుకోని మార్పుల్ని తెచ్చింది. రాను రాను గంగమ్మ ఒంటిలోని ఓపికతోపాటు, బాంకు వడ్డీ రేట్లు దారుణంగా తగ్గిపోయినై. అప్పుడప్పుడు కోడలు వచ్చి "అత్తమ్మా! మాకో కొడుకు పుట్టినా నీ కొడుకు పాత బుద్ధులు మానలేదు. రోజూ తాగొస్తున్నాడు" అని గోడు వెళ్లబుచ్చుకుని వెళ్తోంది.

ఈమధ్య మరో సమస్య ముంచుకొచ్చింది. శివాలయంలో పూజరిగా పంజేస్తూనే వీరభద్రుడు వారుణివాహినికి ధారుణంగా దాసుడయాడు. పూటుగా తాగొచ్చి గంగమ్మ పక్కన కూచుని ఓరోజు "అమ్మా! నాకు ఇల్లు గడుస్తలేదు. శివాలయంల పూజారి ఉజ్జోగం పోయింది. నీ బాంకు డిపాజిట్ విడిపించి నాకివ్వు. నువు నాదగ్గరనే ఉందువు గాని..." చావు కబురు చల్లగా చెప్పాడు. రోజూ అట్లానే వచ్చి కాల్చుకు తింటున్నాడు. ససేమిరా అంటుంది తాను...

గతమంతా గంగమ్మ బుర్రలో తిరిగింది. వర్తమానం కళ్ల ముందుంది.

"అమ్మా.. అమ్మా!" గుడిసె తలుపుతోసుకుని వీరభద్రుడు లోపలికొచ్చాడు. పక్కన కూలబడ్డాడు. గంగమ్మ గుండెల్లో గ్యాసు బుడ్డి పేలింది. ఓపిక తెచ్చుకుని సర్దుక్కొ చుంది.... "వచ్చినవా నాయనా....రా! అగో, గా మంచం ఇరిగిపోయింది. జెర బాగ చేయుంచురా" విరిగిన మంచాన్ని కళ్లతో చూపించింది.

"మరీ... నా మనసుగూడా ఇరిగిపోయింది. దాన్ని నువు, బాగ చేయిస్తే నేను నీ మంచాన్ని బాగ చేయిస్త." భళ్లున నవ్వాడు. దుర్వాసన గుప్పుమంది. పొత్తికడుపులో పేగులు కదిలినట్టనిపించింది.

"థూ! గింత పొద్దుగాల్లనే తాగొచ్చినావురా?" తుపుక్కున ఉమ్మేసి పక్కకు జరిగింది. "ఇంకా నీకు బుద్దెప్పడొస్తదిరా?" ఛీత్కరించింది. నుదిటి రేఖల్లో విల్లమ్ములు గోచరించినై.

"ఇంగో ముసల్దానా!" తాను జరిగి దగ్గరికొచ్చాడు. సూర్యకిరణాలు కళ్లల్లో పడకుండా అరచెయ్యి అడ్డం పెట్టుకున్నాడు. "ఇయ్యాల్ల నీ బాంకు పైసలు నా చేతుల వడాలె. పదా... ఇడిపిద్దాం పదా! అప్పులోళ్లు తిడుతుండ్రు. ఇంటి కిరాయి పది నెలలదియ్యాలె..." చెప్పుకు పోతున్నాడు. కడుపులో తెద్దుతో కలెబెట్టినట్టనిపించింది గంగమ్మకు.

"బాంకుల పైసలు నీకిచ్చి నేను బాజార్ల బిచ్చమడుక్కోవాల్నా? మోకాళ్ల నొప్పుల్తోని బాధపడ్తున్న. ఛాతిల అగ్గివెట్టినట్టు మండుతుంది. ఈ నెల మిత్తి దీసుకొంగనే మల్లా డాక్టరుకు చూపించుకుంటా. నువు పోరా...." ఒక చేతిని గోడ మీద, మరో అరచేతిని నేల మీద ఆసరాగా ఉంచి లేవబోయింది. తాగిన మందు ఇంధనంగా మారి వీరభద్రుని బుర్రలో బురిడీలు కొట్టింది. గంగమ్మ భుజాల మీద చేతులేసి బలవంతంగా కూచోబెట్టాడు.

"ముందు నా సంగతి చూడు. అటెన్క నేనే నిన్ను దావఖానకు తీస్కపోత."

"నువు దీస్కపోయేది దవాఖానాలకు కాదు, బొందలగడ్డకు, అక్కడ నన్ను పాతల వెట్టి ప్రదక్షణాలు చేస్తవురా" అటోఇటో తేల్చుకోవాలనే పట్టుదల పెరిగింది. "అన్న వస్త్రా లడిగితే ఉన్న వస్త్రాలు ఊడబీక్కున్నట్టుగా మంచం బాగచేయించురా కొడకా అంటే బాంకుల పైసలియ్యి మనవడ్తివి. ఈసారి పైసలడిగితే మర్యాద గుండదు. చల్... నువు పోరా..." దగ్గు తెరను లక్ష్యపెట్టకుండా దబాయించింది ముసలి కళ్లు మొసలి కళ్లై పోయినై.

ఓర్నియవ్వ ముసల్దానికే గంత పంతముంటే నాకెంత ఉండాలె? వీరభద్రుణ్ణి వీరావేశం అవహించింది. లేచి నుంచుండి సిగ అందుకున్నాడు. పళ్లు పటపట లాడ్తున్నై.

"ముసలి ముండా! నేను జెప్పినట్టు చేస్తవా లేదా?" గయ్ మన్నాడు. అసహనం పిడికిట్లో కేంద్రీకృతమై సిగ చుట్టూ బిగుసుకుంటోంది. గంగమ్మ పెనుగులాడ్తోంది.

"పోరా బాడ్కావ్!" శక్తినంతా కూడగట్టుకుని కొడుకు చేతుల్ని తోసిపారేసింది. "నా మొగని సొమ్ము నా ఇష్టం. నువ్వెవనివిరా లఫంగా?" ఉరిమింది తిట్ల పురాణం విప్పింది.

"నీ మొగుడూ, మొనగాడు... నా కన్నతండ్రి.... తెలుసా?"

"అయినా సరే. నేను నీకు చిల్లిగవ్వగూడా ఇయ్య...."

"అట్లానా? నువు ఛస్తే ఆ పైసలు నాకే ఇస్తరు." అసహనం, ఆవేశం. రెట్టింపైనాయి. వీరభద్రుని కుడికాలు పైకిలేచి పసిప్రాయములో పారాడిన గుండెల నొక్క తన్ను తన్నింది.

"అమ్మో..." ఆర్తనాదంతో పడిపోయింది. ఆ అరుపు ఊరంతా చావు కేకలా వినబడింది.

వీరభద్రుని మత్తు మాయమైంది. వెన్ను పూసలోంచి వణకు పుట్టుకొచ్చింది.

వామ్మో! ఎవలన్నా వస్తే పోలీసులకు పట్టిస్తరు. బలమంతా పిక్కల్లోకొచ్చింది. దుడ్డ కర్రలతో తరుమబడుతున్న వెర్రి కుక్కలా పరుగు లంకించుకున్నాడు. ఊరి జనాలతోపాటు ఆనంద సేవా సంస్థ కార్యదర్శి గూడా ఆఘమేఘాల మీద చేరుకున్నాడు. గంగమ్మను లేపి కూచోబెట్టి నీళ్లు తాగించారు. ఆనంద కార్యదర్శి ముందున్నాడు. వెంటనే వైద్య సేవ అందింది. మూడురోజుల్లో గంగమ్మ మామూలు మనిషైంది.

"బాంకు పైసలుంటే మావోడు నన్ను బతుకనియ్యడు ఆ పైసల్తోని నా బతుక్కు ఇంకేదన్నా దారిచూపించు బిడ్డా" ఆనంద కార్యదర్శిని బతిమాలింది. బాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్‌కు కదలిక వచ్చింది.

కొండ ప్రాతంమైన కొండపాక గ్రామం అంచున, కొమర వెల్లి పుణ్య క్షేత్రానికి కేక పెట్టు దూరంలో వృద్దుల పాలిట భూలోక స్వర్గములా రూపుదిద్దుకుంటున్న "ఆనంద నందనము" వృద్ధాశ్రమం ఒడిలో గంగమ్మ పసిపాపలా పారాడుతోంది. జీవన యానంలో ధక్కాముక్కీలు తిని అలసిసొలసి, కడుపున పుట్టిన వారి చీత్కారాలను ఓపిక ఉన్నంతవరకు భరించి చివరి మజిలీగా ఆనందనందనము ఒడిలో తోటి సీనియర్ సిటిజన్స్ మధ్య... భ్రమలు, భాధలకు దూరంగా కులాసాగా గడుపుతోంది.

గాలి రెక్కలు గట్టిగా తాకితే రాలిపోయేందుకు మానసికంగా సిద్దమై తలలూపుతున్న పండుటాకులా, శ్రీరామచంద్రుని పలుకరింపు విని తనవు చాలించేందుకు తయారై ఎదిరిచూస్తున్న శబరి మాతలా పరమాత్ముని పిలుపుకోసం ఎదిరి చూస్తోంది.

**ఆదివారం ఆంధ్రభూమి 16-10-2005**

★ ★ ★

